

# పాస్‌వర్డ్

'చాలా రోజులైంది.
మీ పాస్‌వర్డ్ మార్చుకోండి'
అంటూ బ్యాంకు నుంచి మెసేజ్.
ఆమె వెంటనే మార్చేసింది..
బ్యాంకును!
ప్రేమించినవాడి పేరు..
ఎలా మార్చుకుంటుంది పాపం?



# క్యాంపస్ పక్షులు

ఆమె కాలేజీకి రాకపోతే,
ఎందుకు రాలేదని..
నన్ను అడుగుతారు.
నేను టాపర్‌గా నిలిస్తే
ఆమెకు కంగ్రాట్స్ చెబుతారు.
క్యాంపస్.. మమ్మల్ని
ప్రేమికులుగా గుర్తించింది!

# ప్రేమ-పెండ్లి

ఐదేండ్ల తర్వాత అమెరికా నుంచి
తిరిగొచ్చిన ఆ అమ్మాయి..
'ఇంకా పెండ్లి చేసుకోలేదా?'
అని అడిగింది అతణ్ని.
'ఇంకా నన్ను ప్రేమిస్తున్నావా?'
అని ఆ మాటకు అర్థం.





# రెండు ప్రేమలు

ఇద్దరూ ప్రేమించుకున్నారు.
కులాలు అడ్డొచ్చాయి.
ఒకరిది అగ్రవర్ణం.
ఒకరు దళితులు.
ఇరవై ఏండ్ల తర్వాత
ఇద్దరి పిల్లలూ ప్రేమించుకున్నారు.
ఇప్పుడు ఆస్తులు అడ్డొచ్చాయి.
ఒకరు సంపన్నులు.
ఒకరు నిరుపేద.



# ఇంజెక్షన్

ఆమె..
అతని చేతికి
ఇంజెక్షన్ ఇచ్చింది.
అతనికి మాత్రం
గుండెల్లో గుచ్చుకున్నది.
నర్స్ - పేషెంట్
ప్రేమ కథ
ఆరంభం.

